క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

కుప్పం: స్థానిక బాలురు ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయిమాత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జగదీష్ బాబు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామని, కంటి వైద్య నిపుణులు ఈ శిబిరంలో రోగులను పరీక్షించి, ఎంపిక చేసిన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలియజేశారు. దీనిని నియోజకవర్గ ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



ఎమ్మార్సీలో పాఠ్య పుస్తకాల పంపిణీ చేస్తున్న అజయ్‌కుమార్ రెడ్డి

సదుం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి ఒక్కరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వనున్నట్టు సమగ్ర శిక్ష ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో పాఠ్య పుస్తకాలను హెచ్ ఎంలకు అందజేశారు. త్వరలో పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీరాములు, దామోదర, హెచ్ఎం కుమారస్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక హోమాలు



ప్రత్యేక అలంకారంలో స్వామివారు

పలమనేరు: అష్ట కాళ భైరవాష్టమి సందర్భంగా పట్టణంలో బసవన్న కట్టవీధిలోని బసవేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక హోమాలు, పూజలు చేశారు. భక్తులు ఆలయం వద్ద కుష్మాండ దీపాలను వెలిగించారు.

అన్నా క్యాంటీన్ పునఃప్రారంభానికి చర్యలు



క్యాంటీన్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లె వద్ద అన్నా క్యాంటీన్ పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జగన్ మోహన్ ఆదేశాలపై ఆమె స్పందించారు. కమిషనర్ శుక్రవారం సాయంత్రం అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. క్యాంటీన్ పునః ప్రారంభానికి తీసుకోవాలని చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రస్తుతం ఇక్కడ వార్డు సచివాలయం ఉండడంతో దానిని మరో ప్రాంతానికి మార్పు చేసి, క్యాంటీన్ పనులను సత్వరం ప్రారంభించాలని, క్యాంటీన్ పూర్తిస్థాయిలో నిర్వహణకు అవసరమైన అన్ని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పునః ప్రారంభానికి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈ, ఏఈలు ఉన్నారు.

బాబు సంతకాలపై హర్షం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం: చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం మొదట సంతకం చేసిన ఐదు సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కుప్పంలో టీడీపీ నాయకులు ర్యాలీ చేశారు. బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం మాట్లాడుతూ, ఇచ్చిన హామీ మేరకు మొదటి సంతకం డీఎస్సీ, పెన్షన్ రూ.4 వేలకు పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, అన్నా క్యాంటీన్ పునరుద్ధరణపై సీఎం సంతకాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్, రాజ్ కుమార్, ప్రతాప్, సోము, డాక్టర్ వెంకటేష్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు/పలమనేరు : పుంగనూరులో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక న్యాయవాదులు అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. నూతన ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయడంతో భూ వివాదాలను పరిష్కరించుకునేందుకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. అలాగే పలమనేరులో న్యాయవాదులు సైతం ఇదే కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు వెంకటమునియాదవ్, బాలాజికుమార్, రవీంద్ర, కుమార్‌రెడ్డి, కిషోర్, వైవి.రమణారెడ్డి, నవీన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జోహార్ వైఎస్సార్



తీర్థంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం సచివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముసుగు వేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం కోడ్ ఎత్తివేయడంతో శుక్రవారం ఆ ముసుగును తీర్థం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తొలగించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి కలిగిందని, ఆయన పేదల గుండెల్లో చిరస్మరణీయులని సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ కీర్తించారు. ఎన్నికల అనంతరం అందరం కలిసికట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని, కక్ష సాధింపులకు స్వస్తి పలకాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవులు, శ్రీనివాసులు, బాలాజి, మునేగౌడు, ప్రవీణ్‌కుమార్, ఆనంద, శేఖర్, బాలక్రిష్ణ, దామోదర్‌రెడ్డి, రెడ్డెప్ప, గురు తదితరులు పాల్గొన్నారు.

అధికారం మాదే...ఇంటికొచ్చి వెళ్లండి

- గత ప్రభుత్వ పాలనలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వొద్దు
- టీడీపీ నేతల అల్టిమేటం
- అధికారులపై పెత్తనం మొదలెట్టిన నాయకులు
- ఇళ్లకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్న అధికార గణం



లక్కనపల్లెలో టీడీపీ నేతను సత్కరించిన సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓ, కార్యదర్శి

బైరెడ్డిపల్లె: ''మాకు పదవులు లేకపోయినా అధికారం మాదే.. ఇంటికొచ్చి వెళ్లండి'' అంటూ టీడీపీ నాయకులు అధికారులకు ఫోన్ చేస్తుండడంతో వారికేమీ పాలుపోవడం లేదు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో టీడీపీ నేతల ఇళ్లకు పరుగులు తీస్తున్నారు. వెళ్లకపోతే అధికారం అడ్డు పెట్టుకుని ఎక్కడ ఇబ్బందులకు గురి చేస్తారోననే దూరాలోచనతో కొంత మంది అధికారులు శాలువలు, పూలమాలలు, స్వీట్ బాక్సులతో వెళ్లి వారిని కలుస్తున్నారు. మూడు రోజులుగా టీడీపీ నేతల ఫోన్ కాల్స్ దెబ్బకు మండల స్థాయి అధికారులు మొదలుకొని చిరుద్యోగుల వరకు ఇదే తంతు కొనసాగిస్తున్నారు. కొందరు మర్యాదపూర్వకంగా కలిసిస్తే, మరికొందరు వారిని సత్కరిస్తున్నారు. తమ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని, గతంలో సర్పంచులు చేసిన బోరు మోటారు మరమ్మతులు, పైపులైను పనులకు కూడా బిల్లులు చెల్లించరాదని అధికారులకు హుకుం జారీ చేశారు. ఏవైనా సమస్యలు వస్తే అధికారుల వద్దకు వెళ్లాలా.. రాజకీయ నాయకుల వద్దకు వెళ్లాలా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏ టీ దుకాణం వద్ద నలుగురు గుమికూడినా ఇదే విషయాలు చర్చించుకోవడం కనిపించింది.

రక్తదానంతో ప్రాణాలు కాపాడాలి



పోటీలలో విజేతలుగా నిలిచిన వైద్య విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

గుడుపల్లె : రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ఆర్ క్రిష్ణారావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్య కోరారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పీఈఎస్‌లో 'రక్తదాతలకు ధన్యవాదాలు' పేరిట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు స్వచ్ఛందంగా 35 యూనిట్లు రక్తదానం చేశారు. అనంతరం ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలలో తీవ్ర రక్తస్రావమైన వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం వారికి పునర్జన్మనిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూడా రక్తదానం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. రక్తదానం చేసిన ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రక్తదానం ఉపయోగాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు డ్యాన్సులు, షార్ట్ ఫిలిమ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వైద్య విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య అధ్యాపకులు జయశ్రీ పవార్, విద్య, కుమార్ గురు, శోభిత, శరణ్య శంకర్, వీణ, మనీషారామ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు





ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ, ప్రత్యేక అలంకారంలో విరూపాక్షి మారెమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్య సాంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం అమ్మవారిని బంగారు నగలు, పలు రకాల పుష్పాలతో అందంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మారెమ్మ ఆలయంలో..

పుంగనూరు: పట్టణంలో బస్టాండులోని శ్రీవిరూపాక్షి మారెమ్మకు శుక్రవారం మధ్యాహ్నం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.. మహిళలు చలిపిండి దీపాలు వెలిగించి, పొంగలి, పెరుగు అన్నం నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సదుం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం లోని పలు వర్క్‌షాపులు, దుకాణాలలో అజయ్‌కుమార్‌రెడ్డితో పాటు లేబరాఫీసర్ ఆనందబాబు తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ, బాలలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. ఇటువంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లీశ్వరి, విశ్వనాథ్, గట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్ నాయక్

బంగారుపాళెం: క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు కేన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేన్సర్ వ్యాధి ఎలా వస్తుంది? ఏవిధంగా గుర్తించాలి? అనే అంశంపై డాక్టర్లు శిరీష, స్వాతి శిక్షణ ఇచ్చారు. గర్భసంచి ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ కేన్సర్ గురించి వివరించారు. కేన్సర్‌ను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యం అందించడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు సునీల్‌కుమార్ నాయక్ తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు.

అశ్వవాహనంపై ఇంద్రవరదుడి కటాక్షం

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఇంద్రపురి వరదరాజులస్వామి అశ్వవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి అశ్వవాహనం మండల పుర వీధుల్లో ఊరేగించారు. అశ్వ వాహన సేవను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులను చెల్లించారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నూతన ప్రభుత్వం రాష్ట్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి కోరారు. చిత్తూరులో శుక్రవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతన పెంపు హామీని నెరవేర్చాలని, ఉద్యోగులకు సీపీఎస్ అమలు చేయాలని, పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీ, ఆటో కార్మికులకు బోర్డు నుంచి మరింత సంక్షేమం అందించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు జిల్లా కార్మికులు ఐక్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ ధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా నాయకులు రమాదేవి, విజయ్ కుమార్, అంగన్‌వాడీ నాయకులు ప్రభావతి, అరుణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, జయశంకర్, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, సివిల్ సప్లయ్స్ నాయకులు కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పం రూరల్: కుప్పం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీ చిన్నబ్బ తెలిపారు. గుడుపల్లె మండలంలో పాటు కుప్పం మండలంలోని అడవిబూదుగూరు, మల్లానూరు, నూలుకుంట, కంగుంది సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

17న బక్రీద్ ప్రార్థనలు



మాట్లాడుతున్న సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్

పుంగనూరు: బక్రీద్ పండుగ పురస్కరించుకుని ఈనెల 17న సోమవారం ఉదయం 8 గంటలకు ఎస్ఎస్ పేటలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 17న ఉదయం 7.30 గంటలకు పోస్టాఫీసు సర్కిల్ నుంచి ముస్లింలు ప్రార్థనలు చేస్తూ ర్యాలీగా ఎస్ఎస్ పేట ఈద్గా వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. 8 గంటలకు నమాజ్‌తో పాటు ముస్లిం పెద్దల మత బోధనలు నిర్వహిస్తామని తెలిపారు. ముస్లింలు అందరూ ఎలాంటి విభేదాలకు తావు లేకుండా ఐకమత్యంతో ప్రార్థనలకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు సద్దామ్ హుసేన్, బాబాఫకృద్దీన్, ఖాజా, అంజాద్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి





ఏనుగులు తొక్కేసిన టమాట పంట, ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి తోటను చూపుతున్న రైతు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాలలో సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల పొలాలపై విధ్వంసం సృష్టించాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు చూసి కన్నీటి పర్యంతమయ్యారు. దాడుల్లో టమాట, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులు చిన్నబ్బ, పిచ్చమ్మ తాము రూ 20 వేల పంట నష్టపోయినట్లు చెప్పారు. గజదాడులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నా అటవీ అధికారులు ఆ దిశగా సరైన చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోయారు. ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపి పరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

రేపటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- టి.పుత్తూరు దేవస్థానంలో రేపు అంకురార్పణ
- 17 నుంచి వాహన సేవలు ఆరంభం
- 23న రథోత్సవం



టి.పుత్తూరు కోదండరామాలయంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహం



టి.పుత్తూరు కోదండరాములు దేవస్థానం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయ్యర్ స్వామి దివ్య ఆశీస్సులతో ఈ బ్రహ్మోత్సవాలను ఉభయదారులతో వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు. 16న ఆదివారం వేదపండితులతో తిరుమంజనం, స్వామికి పాలాభిషేకం, సాయంకాలం అంకురార్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు.17న సోమవారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం స్వామికి ఊంజల్‌సేవ, రాత్రిలో హంసవాహన సేవ నిర్వహించనున్నారు. అలాగే ఉత్సవాలు ముగిసే వరకూ ప్రతిరోజూ ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి సింహవాహన సేవ, 19న బుధవారం రాత్రి హనుమంత వాహన సేవ, 20వ తేదీ రాత్రి శేషవాహన సేవ, 21వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, కల్యాణ తిరుక్కోణం, రాత్రి గరుడ వాహన సేవ, 22న శనివారం రాత్రి గజవాహన సేవ, 23న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, కీలు గుర్రాలు, గరగాట, కొయ్యకాళ్ల నృత్యం, పులివేషాలు, నయాండి మేళం, చెక్కల భజనలు, కోలాటలు, డప్పు వాయిద్యాలు నడుమ సాగుతుందని వివరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం చేస్తారు. 24వ తేదీ రాత్రి అశ్వవాహన సేవ, 25న మంగళవారం మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంకాలం ఉట్లోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవ నిర్వహించనున్నారు.

ప్రత్యేక ఉత్సవాలు

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా 26న బుధవారం రాత్రి సూర్యప్రభ వాహన సేవ, 27న గురువారం ఉదయం రాత్రి చంద్రప్రభ వాహన సేవ, 28న శుక్రవారం రాత్రి పుష్ప పల్లకి, పాటకచేరి, 29న శనివారం రాత్రి కల్పవృక్ష వాహనసేవ, 30వ తేదీ రాత్రి తెప్పోత్సవం నిర్వహిస్తారు.

దోమలను నిర్మూలిద్దాం



మలేరియా వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసులు

గుడిపాల: గ్రామాల్లో దోమలను నిర్మూలించి మలేరియా వ్యాధి నుంచి కాపాడుకుందామని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా నరహరిపేట హైస్కూల్‌లో శుక్రవారం ఆయన విద్యార్థులతో సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. విద్యార్థులు గ్రామాల్లోని వారి తల్లిదండ్రులకు దోమలను ఎలా నివారించాలో తెలియజేశారు. రాత్రి పూట దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలని సూచించారు. వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో శుభ్రంచేసి ఫినాయిల్, బ్లీచింగ్ చల్లాలన్నారు. నివాస గృహాల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమలో డాక్టర్ సంధ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ పీరూసాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ నారాయణ పాల్గొన్నారు.